సాక్షి
ములుగు
బుధవారం | 18 | జనవరి | 2023



బీఆర్ఎస్ సభ చరిత్రలో నిలిచిపోవాలి - 8లో▸

ఖమ్మంలో బుధవారం(నేడు) నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభ చరిత్రలో నిలిచిపోవాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.



మల్లన్న ఆలయంలో మహాసంప్రోక్షణ - 8లో▸

ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో అత్యంత వైభవోపేతంగా జరిగిన మకర సంక్రాంతి పండుగ జాతర ఉత్సవాలు ముగిశాయి.

వాతావరణం

గరిష్టం/కనిష్టం $31^0/17^0$

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. రాత్రి సమయంలో చలి తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'కంటి వెలుగు'కు ఏర్పాట్లు పూర్తిచేయాలి



ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమానికి ఆయా పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కొండా వెంకయ్య అన్నారు. జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్యతో కలిసి డీపీఓ ములుగు, దేవనగర్ గ్రామాల్లో మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ పంచాయతీ ఆధ్వర్యంలో కంటి వెలుగుకు హాజరయ్యే ప్రజలకు సౌకర్యాలు టెంట్లు, కుర్చీలు, తాగునీటి వసతి కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

స్థానికత ఆధారంగా బదిలీలు చేపట్టాలి

ములుగు రూరల్: స్థానికత ఆధారంగా ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హట్కర్ సమ్మయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏక పక్షంగా అమలు చేసిన జీఓ నంబర్ 317తో ఉపాధ్యాయులు స్థానికతను కోల్పోయారని తెలిపారు. అదే విధంగా ప్రభుత్వం చెల్లించాల్సిన డీఏ వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పస్వామి, మోహన్, వైనాల స్వామి, రాందేవ్, నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

ఇనుప సామగ్రి వేలం

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మ దేవదాయ శాఖ ప్రాంగణంలోని తుప్పు పట్టిన ఇనుప సామగ్రిని వేలం వేయనున్నట్లు ఈఓ రాజేంద్రం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 21వ తేదీ వరకు కొటేషన్లను దేవస్థాన కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

మహాముత్తారం: మహాముత్తారం మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మంచినీళ్ల సుచిత్ర జాతీయ స్థాయి ఖేలో ఇండియా వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. సుచిత్ర హైదరాబాద్‌లోని హకీంపేట స్పోర్ట్స్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఇటీవల ఢిల్లీలో జరిగిన రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా వాలీబాల్ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. దీంతో జాతీయస్థాయికి ఎంపికైంది. తల్లిదండ్రులతో పాటు తోటి విద్యార్థులు, స్నేహితులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

ఎన్నికల లక్ష్యంగా వద్దు..

భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల లక్ష్యంగా బదిలీలు, పదోన్నతులు నిర్వహించవద్దని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పెండెం మధుసూదన్, కుర్రె ప్రవీణ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు, సాధారణ ఎన్నికల ఎత్తుగడలో భాగంగా అనుచిత, అనుపయోగ హామీల లాగా ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు చేపట్టకూడదన్నారు. ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలకు పరిష్కార మార్గం చూపే విధంగా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేసే విధంగా బదిలీలు పదోన్నతులు ఉండాలన్నారు. 317జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, బదిలీలు అందరికీ జరిగేలా చూడాలని కోరారు. మోడల్ స్కూల్, కేజీబీవీ, ఆశ్రమ గిరిజన పాఠశాలల ఉపాధ్యాయులకు కూడా బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష ఫలితాల వెల్లడిలో జాప్యం

చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి
టెక్స్‌టైల్ కార్పొరేషన్ చైర్మన్ ప్రవీణ్

నిట్‌లో ముగిసిన సివిల్ వర్క్‌షాప్

దేవాలయ భూమిని కాపాడాలి

- వివరాలు 10లో▸

ఎకో టూరిజానికి.. పూర్వ వైభవం

లక్నవరంలో ప్రారంభమైన నైట్ క్యాంపెనింగ్, సైక్లింగ్

- అదే తరహాలో ఎస్ఎస్ తాడ్వాయి అడవుల్లో ఏర్పాట్లు
- గ్రీన్ మేడారానికి అటవీశాఖ కసరత్తు




ములుగు: కరోనా మహమ్మారి మొదలైనప్పటి నుంచి జిల్లాలో నిలిచిపోయిన ఎకో టూరిజం గత నెల రోజుల క్రితం నుంచి తిరిగి పునః ప్రారంభమైంది. మొదటగా గోవిందరావుపేట మండలం లక్నవరంలో ఫైర్ క్యాంపెనింగ్, సైక్లింగ్ వంటివి మొదలయ్యాయి. దీంతో జిల్లాలో ఎకో టూరిజానికి పూర్వ వైభవం వచ్చినట్లు అయింది. ఇదిలా ఉండగా ఎస్ఎస్ తాడ్వాయి మండల కేంద్రంలోని హట్స్, వాజేడు మండల పరిధిలోని బొగత జలపాతం ప్రాంతాల్లో సైతం ఎకో టూరిజం సేవలను త్వరలోనే పునరుద్ధరించనున్నారు. ఇందులో భాగంగా అటవీశాఖ బ్రోచర్లను సైతం విడుదల చేసింది.

గ్రీన్ మేడారానికి కసరత్తు

మేడారం సమ్మక్క–సారలమను దర్శించుకోవడానికి వారాంతంలో హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ, నిజామాబాద్ వంటి ప్రధాన పట్టణాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. ఇలా వస్తున్న భక్తులు ప్రైవేట్ వాహనాల్లో వచ్చి అడవుల్లో వంటలు వండుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు. ఈ క్రమంలో వారు వినియోగించే ప్లాస్టిక్ బాటిళ్లు, పేపర్లు, మందు సీసాలు వంటివి అక్కడే వదిలేసి పోతున్నారు. దీంతో మేడారం పరిసర ప్రాంతాల్లో చింతల్ క్రాఫ్ట్ నుంచి ఊరటం వరకు, తాడ్వాయి నుంచి మేడారం వరకు, చిలకల గుట్ట వంటి ప్రాంతాల్లో ప్లాస్టిక్ చెత్తాచెదారం పేరుకుపోయి ఉంటుంది. ఈ కారణంగా పచ్చని అడవికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని భావించిన జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణగౌడ్ గ్రీన్ మేడారం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. స్థానికంగా ఉన్న నిరుద్యోగులకు ఔట్ సోర్సింగ్ పద్ధతిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు గ్రీన్ మేడారానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం వచ్చేనెల 1వ తేదీ నుంచి మొదలు కానుంది.

ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు



జిల్లాలోని పర్యాటక ప్రాంతాలైన లక్నవరం, బొగత జలపాతం, ఎస్ఎస్ తాడ్వాయి హట్స్ వంటి ప్రాంతాల్లో ఎకో టూరిజం అభివృద్ధికి అన్ని రకాల చర్యలు చేపడుతున్నాం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు లక్నవరం, ఎస్ఎస్ తాడ్వాయి అడవుల్లో సైక్లింగ్, నైట్ క్యాంపెనింగ్‌కు ఏర్పాట్లు చేశాం. మేడారం పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చెత్తాచెదారం లేకుండా చేయడానికి గ్రీన్ మేడారం కార్యక్రమాన్ని వచ్చే నెల నుంచి ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాం. దీని కోసం చెత్త డంపింగ్‌కి ప్రత్యేక సెగ్రిగేషన్ షెడ్డును నిర్మిస్తున్నాం. అమ్మవార్లను దర్శించుకోవడానికి వచ్చే భక్తులు అడవుల్లో వ్యర్థాలను వదలొద్దు. చెత్త సేకరణకు ఔట్ సోర్సింగ్ పద్ధతిన నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నాం.

- కృష్ణగౌడ్, జిల్లా అటవీశాఖ అధికారి

24 గంటలకు.. రూ.4 వేలు

ఏటూరునాగారం వైల్డ్‌లైఫ్ శాంచురి టూర్‌లో భాగంగా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలో నైట్ క్యాంపెనింగ్, సైక్లింగ్, ఎన్విరాల్‌మెంట్ ఎడ్యుకేషన్ సెంటర్, పురాతన డోలమైట్స్ వీక్షణ, బ్లాక్‌బెర్రీ ఐలాండ్, కొండేటి వ్యూ పాయింట్‌లను సందర్శించవచ్చు. ఈ సేవలు సంవత్సరం మొత్తంలో 24 గంటల పాటు అందుబాటులో ఉంటాయి. వీరికి భోజనంతో పాటు గైడ్‌ను ఏర్పాటు చేస్తారు. ఇక లక్నవరం అడవుల్లో సైక్లింగ్, టెంట్ల మధ్యలో నైట్ క్యాంపెనింగ్, బోటింగ్, అడవుల మధ్యలో ఉన్న ఐలాండ్‌లు, సఫారి, బుల్‌కాట రైడ్ వంటి సేవలు శనివారం సాయంత్రం 4 గంటల నుంచి ఆదివారం సాయంత్రం 4 గంటల వరకు ఉంటాయి. దీనికి గానూ రూ.4వేలు చెల్లించాల్సి ఉంటుంది. పలు ప్రాంతాల నుంచి వచ్చే వారు ఈ సేవలకు గానూ డబ్ల్యాడబ్ల్యూడబ్ల్యూ.ఎకోటూరిజం.ములుగు.కామ్ ద్వారా బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. మిగతా వివరాలకు ఎకో టూరిజం జిల్లా కో ఆర్డినేటర్ సెల్ నంబర్ 9440810881లో సంప్రదించాలి.



అటవీ శాఖ విడుదల చేసిన బ్రోచర్

21న జాకారంలో జాబ్‌మేళా


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పీఓ

ఏటూరునాగారం: జిల్లా పరిధిలోని జాకారం వైటీసీలో ఈ నెల 21న ఏటూరునాగారం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్‌మేళాకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగులు తరలివచ్చేలా చూడాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో డీటీడీఓలు, డీఆర్డీఓలు, ఎంపీడీఓలతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో జాబ్‌మేళాకు తరలివచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వార్డెన్లు, హెచ్‌ఎంలు, ఏపీఎంలు, సీసీల ద్వారా అధిక సంఖ్యలో నిరుద్యోగులు హాజరయ్యేలా చూడాలన్నారు. డీడీలను, డీఆర్డీఓలను అన్ని గ్రామాల్లోని పంచాయతీల సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ద్వారా సమాచారం ఇచ్చి జాబ్‌మేళాకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాళ్ల నుంచి ఐటీఐ పూర్తి చేసిన వారి జాబితాను తీసుకొని వారికి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ వసంతరావు, డీడీలు, డీఆర్డీఓలు, ఎంపీడీఓలు, ఎస్ఓ రాజ్‌కుమార్, జేడీఎం కొండల్‌రెడ్డి, పెసా కోఆర్డినేటర్ ప్రభాకర్, జేఆర్పీలు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'.. ట్రయల్ రన్


వైద్య పరీక్షల రిహార్సల్ చేస్తున్న వైద్యులు


కంటి పరీక్ష విధానాన్ని పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

ఏటూరునాగారం: మండల పరిధిలోని చెల్పాక గ్రామంలో కంటి వెలుగు వైద్య శిబిరం ట్రయల్ రన్ మంగళవారం జిల్లా కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి, వైద్యుడు మంకిడి వెంకటేశ్వర్లు చేపట్టారు. రేపటి నుంచి జిల్లా వ్యాప్తంగా కంటి వెలుగు వైద్య శిబిరాలు ప్రారంభం కానుండడంతో వైద్యుడు, కంటి వైద్య పరీక్ష చేసే వ్యక్తి, పేర్లు నమోదు చేసుకునే ఆశ కార్యకర్త కౌంటర్‌లను ఏర్పాటు చేశారు. ఏ ఉద్యోగి ఎలాంటి డ్యూటీ చేయాలని వివరించారు. పరీక్షలు చేసిన వారికి అద్దాలు ఇవ్వడం, మందులు ఇవ్వడంతో పాటు వారి వివరాలను సేకరించి శస్త్ర చికిత్సకు తరలించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు సిబ్బందికి వివరించారు. కంటి పరీక్షలు చేసే విధానంపై రిహార్సల్ చేసి చూపించారు. గ్రామంలోని ప్రజలు, స్థానిక సర్పంచ్, ఇతర శాఖల అధికారులు కంటి వెలుగు శిబిరానికి ప్రజలు వచ్చే విధంగా చూడాలని ఆయన కోరారు. యువతీ యువకులు వారి తల్లిదండ్రులను కంటి వెలుగు శిబిరానికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు సుమలత, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ దిలీప్, ఏఎన్‌ఎం ఆదిలక్ష్మి, సర్పంచ్ సుమతిరమేష్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో భక్తుల రద్దీ


కాలసర్ప నివారణ పూజలు నిర్వహిస్తున్న భక్తులు


కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు ముందుగా త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కాలసర్ప నివారణ పూజలను భక్తులు సామూహికంగా అధికసంఖ్యలో నిర్వహించారు. అనంతరం స్వామివారి గర్భగుడిలో ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. దీంతో ఆలయ పరిసరాలు, గోదావరి తీరంలో భక్తుల సందడి కనిపించింది.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ


శిక్షణకు హాజరైన అధికారులకు సూచనలు చేస్తున్న డీఎల్‌పీఓ దేవరాజ్

మంగపేట: 2023–2024 ఆర్థిక సంవత్సరం జీపీల అభివృద్ధి ప్రణాళికను తయారు చేసేందుకు ఎంపీడీఓ కార్యాలయంలో డీఎల్‌పీఓ దేవరాజ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, బ్లాక్ అభివృద్ధి ప్రణాళికను రూపొందించే విధానంపై డీఎల్‌పీఓ, వెంకటాపురం(కె) ఎంపీడీఓ బాబు వివరించారు. గ్రామ పంచాయతీలలో స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, వనరులు కల్పించడం, పచ్చదనం పరిశుభ్రత, స్వయం సమృద్ధి, సామాజిక సురక్షితం, సుపరిపాలన, పేదరికం లేని మెరుగైన జీవనోపాధి తదితర సౌకర్యాల కల్పించి గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికను ఎలా రూపొందించాలనే విషయాలను ఆయా శాఖల అధికారులకు శిక్షణ ఇచ్చారు. గ్రామ స్వరాజ్‌లో గ్రామ పంచాయతీలలో మొత్తం 9 రకాల అంశాలలో ముందుగా ఏదైనా రెండు అంశాలను వాటిని అభివృద్ధి చేసి అనంతరం మరో రెండు అంశాలను ఎంచుకుని 2030 నాటికి అన్ని గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసే విధంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ శ్రీనివాస్, లైన్ డిపార్టుమెంట్ అధికారులు డాక్టర్ నిఖిల్‌కుమార్, యమున, మెడికల్, అంగన్‌వాడీ, వెటర్నరీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలు ఉధృతం చేయాలి


మాట్లాడుతున్న రాజేందర్

కన్నాయిగూడెం: ప్రజలను మోసం చేస్తూ కాలం వెల్లదీస్తున్న ప్రభుత్వాలపై ప్రజా పోరాటాలు మరింత ఉధృతం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు రత్నం రాజేందర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సమావేశం సురేష్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ మోసానికి పాల్పడుతుందన్నారు. ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ పరం చేస్తుందని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం పోడు భూములకు పట్టాలిస్తామని చెప్పి సర్వే చేసి పట్టాలివ్వకుండా కాలయాపన చేస్తుందని దుయ్యబట్టారు. వెంటనే పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అటవీ అధికారులు మాత్రం పోడు రైతుల మీద దాడులు ఆపడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కావిరి సుధాకర్, రామారావు, చిరంజీవి, లక్ష్మణ్ రావు, అజయ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

మిగిలింది రెండు వారాలే..

మినీ మేడారానికి సమీపిస్తున్న గడువు

- జాతరలో సౌకర్యాల కల్పనకు రూ.2కోట్లు మంజూరు
- దేవాదాయ శాఖ పనులు మాత్రమే మరూ
- మిగితా శాఖల అధికారులు మొదలు పెట్టని వైనం


సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపడుతున్న టెక్నీషియన్

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మ మినీ జాతరకు ఇంకా రెండు వారాల సమయమే మిగిలి ఉంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పక్క రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కానున్నారు. దాదాపుగా 5 నుంచి 10 లక్షల మంది భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. జాతరకు వచ్చే భక్తులు సౌకర్యాల ఏర్పాటుకు కలెక్టర్ ప్రధాన శాఖలకు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేశారు. జాతర సమయం దగ్గర పడుతున్నప్పటికీ దేవాదాయ శాఖ అధ్వర్యంలో మాత్రమే ఏర్పాట్ల పనులు మొదలయ్యాయి తప్పా మిగిలిన ఏ ఒక్క శాఖ అధికారులు కూడా ఏర్పాట్ల పనులు మొదలు పెట్టలేదు. ప్రధానంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శాశ్వత సులభ్ కాంప్లెక్స్‌లకు మరమ్మతు పనులు ఇంకా చేపట్టలేదు.తాగునీటి ఏర్పాట్ల పనులు కూడా ఇంకా మొదలు కాలేదు. మేడారం గ్రామ పంచాయతీ అధ్వర్యంలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేస్తున్నారు.

దేవాదాయ శాఖ అధ్వర్యంలో..

మినీ జాతరకు గడువు సమీపిస్తుండడంతో దేవాదాయ శాఖ అధ్వర్యంలో చేపట్టాల్సిన పనులను అధికారులు చేపట్టారు. అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో సీసీ కెమెరాల మరమ్మతులకు చర్యలు చేపట్టారు. జాతరలో మండమెలిగె పండుగ పూజా కార్యక్రమాలన్ని సమ్మక్క గుడి వద్ద సమ్మక్క పూజారులు నిర్వహిస్తారు. దీంతో సమ్మక్క గుడి ప్రాంగణంలోని చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేసే పనులు చేపట్టారు. గుడి వద్ద కూడా విద్యుత్ దీపాల అలంకరణ పనులు ప్రారంభించారు. దేవాదాయ శాఖ అధ్వర్యాన నేటి నుంచి గద్దెల ప్రాంగణంలో భక్తులకు నీడ కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తామని ఈఓ రాజేంద్రం తెలిపారు. మేడారానికి ముందస్తు మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చే భక్తులు కానుకలు సమర్పించేందుకు పూజారుల సమక్షంలో సమ్మక్క సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దె ప్రాంగణంలో 28 హుండీలకు సీలు వేసి సిద్ధం చేసి ఉంచారు.


సమ్మక్క గుడి వద్ద శుభ్రం చేస్తున్న సిబ్బంది


గద్దె ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హుండీలు

ఇప్పటికే మొదలైన భక్తుల సందడి

మేడారానికి భక్తుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. ముఖ్యంగా ఆది, బుధ, గురు, శుక్ర వారాల్లో భక్తులు 10 నుంచి 20 వేలకు తగ్గకుండా తరలివస్తున్నారు. ముందస్తుగా వచ్చిన భక్తులకు జంపన్నవాగు స్నానాల ఘట్టాల వద్ద బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ అదనంగా ఏర్పాటు చేయకపోవడం, డ్రెసింగ్ గదులు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటి వరకు పనుల అసంపూర్తిగానే ఉన్నాయి. మినీజాతరకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఐటీడీఏ పీఓ అంకిత్‌లు మినీ జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షలు నిర్వహించి, పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అదేశాలిచ్చినప్పటికీ అధికారుల్లో మాత్రం చల్లనం లేకుండా పోయింది.

రేపు ఎంఎస్‌పీ సమావేశం



భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం భవన్‌లో 19న ఉదయం 11గంటలకు మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) ముఖ్యకార్యకర్తల సమావేశానికి మండల, నియోజకవర్గ నాయకులు హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ గట్ల రాజన్న, నాయకులు బట్టు విజయ్, నోముల శ్రీనివాస్, భిక్షపతి, సిద్దన్న, విజయ పాల్గొన్నారు.

వోల్వో డ్రైవర్లకు వేతనాలు పెంచాలి


మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి అర్బన్: ఓసీ–2 ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న వోల్వో కాంట్రాక్టు డ్రైవర్లకు వేతనాలు పెంచాలని టీపీసీసీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. ఓసీ–2 వద్ద 10రోజులుగా సమ్మె చేస్తున్న డ్రైవర్లకు గండ్ర సత్యనారాయణరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిత ప్రకాశ్‌రెడ్డి మంగళవారం సంఘీభావం తెలిపి మాట్లాడారు. 10రోజులుగా ప్రైవేట్ ఓల్వో డ్రైవర్లు జీతాల పెంపు కోసం నిరసన ప్రదర్శన చేస్తుంటే సదరు ఎస్‌వీఈసీ కాంట్రాక్టర్, సింగరేణి యాజమాన్యం పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. డ్రైవర్లు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం సింగరేణి అధికారులకు, సదరు కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులతో ఫోన్లో మాట్లాడి తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరారు. వోల్వో డ్రైవర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధు, దేవన్, శ్రీదేవి, శ్రీనివాస్, కొమురయ్య, రాజేందర్, మహేందర్, భువన సుందర్, గూట్ల తిరుపతి, కుమారస్వామి, రజినీకాంత్, రంజిత్, శ్రీనివాస్, మహేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని యువతి మృతి


ప్రగతి (ఫైల్)

కాశిబుగ్గ: రైలు ఢీకొని యువతి మృతి చెందిన సంఘటన వరంగల్, చింతలపల్లి రైల్వేస్టేషన్ల మధ్య సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ధనసరికి చెందిన చాగంటి ప్రగతి(18) తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోయారు. వరంగల్ అబ్బనికుంటలోని తన పిన్ని వద్ద ఉంటూ ఎల్‌బీ కళాశాలలో డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతోంది. చిన్నతనం నుంచి పోలీస్ కావాలనే ఆశయంతో ఎన్‌సీసీలో శిక్షణ పొందుతుంది. ఈ నెల 12న ఎన్‌సీసీ క్యాంపునకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి నర్సంపేటలోని స్నేహితురాలి ఇంటికి వెళ్లింది. తిరిగి 16వ తేదీ సాయంత్రం నర్సంపేట నుంచి బస్సులో వరంగల్‌కు చేరుకుంది. పట్టాల వెంట నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న క్రమంలో చింతల్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో వరంగల్‌కు వచ్చే కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. దీంతో ప్రగతి అక్కడికక్కడే మృతి చెందింది. ఎంజీఎంలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మంగళవారం మృతురాలి పిన్నికి అప్పగించారు. ప్రగతి మృతిపై అనుమానం వ్యక్తం చేయడంతో విచారణ జరుపుతున్నట్లు జీఆర్పీ సీఐ తెలిపారు.

మూడో రైల్వేలైన్ సర్వేకు అధికారుల రాక


హెలికాప్టర్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

కాజీపేట రూరల్: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జోన్ పరిధిలో గల విజయవాడ–మధ్యప్రదేశ్‌లోని ఇటార్సీ వరకు మూడో రైల్వేలైన్ ట్రాక్‌కు సంబంధించిన జీపీఎస్ ఏరియల్ సర్వే కోసం ఇంజనీరింగ్ అధికారులు మంగళవారం హెలికాప్టర్‌లో కాజీపేట సెయింట్ గ్యాబ్రియల్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. విజయవాడ నుంచి సర్వే చేసుకుంటూ బయలుదేరిన హెలికాప్టర్‌లో ఇంధనం అయిపోరావడం, సాయంత్రం కావడంతో ఎయిర్‌లైన్స్ అధికారుల ఆదేశానుసారం కాజీపేటలో ల్యాండింగ్ అయినట్లు అధికారులు తెలిపారు. కాజీపేటలో రాత్రి బస చేసి ఏరియల్ సర్వే నిమిత్తం బుధవారం హెలికాప్టర్‌లో వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హెలికాప్టర్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కాజీపేట సీఐ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు.

పవిత్ర జలంతో మహా సంప్రోక్షణ చేస్తున్న ఆలయ అర్చకులు



స్వామివారికి వస్త్రాలు సమర్పిస్తున్న కూనూరు పూజారులు



మల్లన్నను దర్శించుకుంటున్న ట్రిబ్యునల్ జడ్జి సత్యేంద్ర



మల్లన్న ఆలయంలో మహాసంప్రోక్షణ

- శ్వేత లింగానికి అభిషేకం, అన్నపూజ
- కూనూరు ఉమామహేశ్వర ఆలయం నుంచి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పణ

ఐనవోలు: ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో అత్యంత వైభవోపేతంగా జరిగిన మకర సంక్రాంతి పండుగ జాతర ఉత్సవాలు ముగిశాయి. ఆలయ సంప్రదాయం ప్రకారం మంగళవారం పండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య మహాసంప్రోక్షణ నిర్వహించారు. ఉదయమే ఆలయ ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ ఆధ్వర్యంలో గర్భాలయాన్ని శుద్ధి చేయగా ఒగ్గు పూజారులు స్వామివారిని మేలు కొలిపారు. స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలు అలంకరించారు. అర్చకులు స్వామివారి బండారి(పసుపు) నీటిలో కలిపి మామిడి ఆకును కలశంలో ఉంచి మేళతాళాల నడుమ వేద మంత్రోచ్ఛరణలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణగా తిరుగుతూ భ్రమరాంభిక, ఎల్లమ్మ ఆలయాలతో పాటు అన్ని కార్యాలయాలను పవిత్ర జలంతో శుద్ధిచేశారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, మహాన్యాస పూర్వక శత రుద్రాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం లింగాకారుడిని అన్నంతో అలంకరించి అన్నపూజ చేశారు. దీంతో సంక్రాంతి నుంచి ఉగాది వరకు జరిగే జాతర, బ్రహ్మోత్సవాల్లో మకర సంక్రాంతి నాలుగు రోజుల జాతర తొలి ఘట్టం ముగిసినట్లయింది. రానున్న రోజుల్లో భ్రమరాంభిక ఆలయ వార్షికోత్సవ వేడుకలు, శివ రాత్రి బ్రహ్మోత్సవాలు, శివరాత్రి రోజు పెద్దపట్నం, భ్రమరాంభిక అమ్మవారితో శివ కల్యాణం, ఉగాది ముందు వచ్చే ఆదివారం మరోసారి పెద్దపట్నం, బలిజ మేడలమ్మ, గొల్లకేతమ్మలతో ప్రత్యేకంగా మల్లన్న కల్యాణం జరపనున్నారు. నాలుగు రోజుల ఉత్సవాల్లో సుమారు 8లక్షల మంది భక్తులు పాల్గొన్నట్లు అంచనా వేస్తున్నామని ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. ఉగాది వరకు ప్రతి ఆది, బుధవారాల్లో స్వామివారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుంటారని, మరో ఐదు లక్షల మంది స్వామివారిని దర్శించుకునే అవకాశం ఉందని వెల్లడించారు.

పట్టువస్త్రాల సమర్పణ

లక్షలాది మంది జాతరలో పాల్గొనగా పూజలందుకున్న మల్లికార్జునస్వామి, గొల్లకేతమ్మ, బలిజ మేడలమ్మ, భ్రమరాంభిక అమ్మవార్లకు సంప్రోక్షణ అనంతరం కూనూరు ఉమామహేశ్వరస్వామి ఆలయం నుంచి అర్చకులు మధుశర్మ, సదాశివశర్మ ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో వేద పారాయణదారు గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు మధుశర్మ, భానుప్రసాద్, నరేష్‌శర్మ, శ్రీనివాస్, కూనూరు సర్పంచ్ ఇల్లందుల కుమార్, ఎంపీటీసీ శ్రీనివాస్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న జిల్లా ట్రిబ్యునల్ జడ్జి

ఐలోని మల్లన్నను హనుమకొండ జిల్లా ట్రిబ్యునల్ జడ్జి వై.సత్యేంద్ర దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం జడ్జి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయగా స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసి శేషవస్త్రాలతో సత్కరించారు.


లింగాకారుడిని అన్నంతో అలంకరించిన దృశ్యం

తండ్రిపై పెంపుడు కుమారుడి దాడి

వర్ధన్నపేట: తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోగా పెంచుకున్న పిల్లవాడే తండ్రిపై కత్తిపీటతో దాడి చేసిన ఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లందలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సిరిపాటి వెంకటేశ్–యాకమ్మ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొన్నేళ్ల కిందట యాకమ్మ సోదరి, మరిది మృతి చెందారు. దీంతో వారి కుమారుడైన నితిన్‌ను వెంకటేశ్–యాకమ్మ దంపతులు సొంత కొడుకు వలే పెంచుకున్నారు. కాగా, నితిన్ మద్యానికి బానిసై ఇష్టారీతిగా ప్రవర్తిస్తున్నాడు. సోమవారం బాగా మద్యం తాగి రావడంతో వెంకటేష్ మందలించాడు. దీంతో కోపోద్రిక్తుడై నితిన్ కత్తిపీటతో అతడిపై దాడి చేయడంతో తొడ, చేతి మణికట్టుపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మంగళవారం యాకమ్మ ఫిర్యాదు చేయడంతో నితిన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామారావు తెలిపారు.

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

- యువతి మృతి

ఎస్ఎస్ తాడ్వాయి: ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనలో యువతి మృతి చెందగా, యువకుడు అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నాడు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం లింగాలలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. లింగాల గ్రామానికి చెందిన కొమురం ప్రభాస్, గంగారం మండలం దుబ్బగూడెంకు చెందిన సువర్ణపాక యమున(18) ప్రేమించుకుంటున్నారు. యమున లింగాల గ్రామంలోని తన సమీప బంధువుల ఇంటికి వచ్చింది. అక్కడ ఏం జరిగిందోగాని ప్రేమికులిద్దరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా యమున మృతి చెందింది. ప్రభాస్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

బీఆర్ఎస్ సభ చరిత్రలో నిలిచిపోవాలి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

మరిపెడ: ఖమ్మంలో బుధవారం(నేడు) నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభ చరిత్రలో నిలిచిపోయేలా జన సమీకరణ చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పార్టీ నాయకులకు సూచించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని నవీన్‌రావు అతిథి గృహంలో డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, ఎంపీ మాలోత్ కవితతో కలిసి జనసమీకరణపై మంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ డోర్నకల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉందన్నారు. ఇక్కడ నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలను సభకు తరలించేలా నాయకులు జనసమీకరణ చేయాలన్నారు. కార్యకర్తలను తరలించే వాహనాల్లోనే లీడర్లు సభకు రావాలని సూచించారు. పార్టీ కోసం పాటుపడే నాయకులు, ప్రజాప్రతినిధుల గ్రామాలకు పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. అదేవిధంగా ఫిబ్రవరిలో ప్రతి నియోజకవర్గానికి 2 నుంచి 3 వేల ఇళ్లను మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్, మండల ఇన్‌చార్జ్ మెట్టు శ్రీనివాస్, జనగామ జిల్లా గ్రంథాలయ చైర్మన్ యడవెల్లి కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అచ్చుత్‌రావు, మహేందర్‌రెడ్డి, గడ్డం వెంకన్న, మరిపెడ ఎంపీపీ గుగులోత్ అరుణరాంబాబు, జెడ్పీటీసీ తేజావత్ శారదరవీందర్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు ఉప్పల నాగేశ్వర్‌రావు, అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దాతల చేయూతకు ఎదురుచూపులు

ట్రస్ట్ చేతిలో మోసపోయిన వైద్య విద్యార్థి

- ఫీజు కట్టేందుకు ఆర్థికసాయం చేయాలని తల్లిదండ్రుల వేడుకోలు

కాజీపేట: ఓ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు చెప్పిన మాటలు నమ్మి వైద్య విద్య కోసం రష్యాకు వెళ్లిన విద్యార్థి ఆ ట్రస్టు చేతులు ఎత్తేయడంతో చదువు కొనసాగించలేక, తిరిగి రాలేక మనసున్న మహారాజుల సాయం కోసం అభ్యర్థిస్తున్నాడు. కాజీపేటకు చెందిన మోరోజు వంశీకృష్ణ వైద్య విద్య అభ్యసించాలనుకున్నాడు. ఏడాది ఫీజు కడితే చాలు మిగతాది స్కాలర్‌షిప్ వస్తుంది.. వైద్య విద్య పూర్తవుతుందని పుట్ట కిశోర్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు చెప్పిన మాటలు నమ్మి రష్యాలోని ఏసియన్ మెడికల్ కాలేజీలో చేరాడు. ఆరు నెలలు గడవక ముందే ట్రస్టు నిర్వాహకులు ముఖం చాటేయడంతో కుటుంబ సభ్యులు అప్పు చేసి నాలుగో ఏడాది వరకు చదివించారు. ఇటీవల ఏసియన్ మెడికల్ కాలేజీ నిర్వాహకులు రూ.2లక్షలు కడితేనే ఫైనల్ ఎగ్జామ్స్ రాయనిస్తామని స్పష్టం చేశారు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు కనిపించిన వారినల్లా సాయం కోసం అభ్యర్థిస్తున్నారు. వైద్య విద్యలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన వంశీకృష్ణ సర్టిఫికేట్లను పట్టుకుని ప్రజాప్రతినిధులు, నాయకుల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. ఎక్కడా సరైనా భరోసా రాకపోవడంతో కన్నీరు పెడుతున్నారు. వంశీకి దాతలు సాయం చేస్తే ఫైనల్ ఇయర్ పూర్తిచేసే అవకాశం ఉందని వేడుకుంటున్నారు.

ఆర్థికసాయం చేయాలనుకునే వారు 91776 38463 నంబర్‌కు ఫోన్‌పే లేదా గూగుల్ పే చేయగలరు.

తైక్వాండో పోటీల్లో పేద విద్యార్థిని ప్రతిభ..

- యూపీలో జాతీయస్థాయి పోటీలు
- పాల్గొనేందుకు ఆర్థికసాయం కోరుతున్న అంకిత


తైక్వాండోలో గోల్డ్‌మెడల్ సాధించిన అంకిత

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రానికి చెందిన గొడిశాల అంకిత(ఇంటర్ విద్యార్థిని) రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈ మేరకు యూపీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు దాతలు ఆర్థిక సాయం చేయాలని కోరుతోంది. గూడూరు ఎస్సీ కాలనీకి చెందిన గొడిశాల ప్రభాకర్ – సైదమ్మ దంపతులకు ముగ్గురు ఆడ పిల్లలు. రెండో కుమార్తె అంకిత 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కేసముద్రం మండలం ఇనుగుర్తిలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో చదివింది. ప్రస్తుతం మానుకోటలోని సోషల్ వెల్ఫేర్ కళాశాలలో ఎంపీసీ చదువుతుంది. 8వ తరగతి నుంచి తైక్వాండోలో రాణిస్తున్న అంకితకు మానుకోటకు చెందిన కోచ్ రమేష్ శిక్షణ ఇస్తున్నాడు. ఈక్రమంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో గోల్డ్‌మెడల్స్ సాధించింది. గతేడాది డిసెంబర్‌లో వికారాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న అంకిత గోల్డ్‌మెడల్ సాధించి ఈ నెల 26 నుంచి 30 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బరేలీ జిల్లాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది.

పేదరికంలో కుటుంబం..

నిరుపేద కుటుంబానికి చెందిన గొడిశాల అంకిత యూపీలో జరిగే జాతీయ స్థాయి క్రీడలకు వెళ్లాలంటే సుమారు రూ.40 వేల ఖర్చు అవుతుంది. తల్లిదండ్రులు కూలీలని, వారి వద్ద అంత పెద్ద మొత్తంలో డబ్బు లేదని అంకిత వాపోతుంది. దాతలు ఆర్థిక సాయం చేస్తే క్రీడల్లో పాల్గొని జిల్లాకు మంచిపేరు తీసుకువస్తానని వేడుకుంటోంది.

ఆర్థికసాయం చేయాలనుకునే వారు 97012 75451, 99495 12440 నంబర్లకు గూగుల్‌పే, ఫోన్‌పే చేయగలరు.


ఈఓ వద్దకు పూజారుల వాటా పంచాయితీ



ఈఓకు వినతిపత్రం అందజేస్తున్న పూజారి లక్ష్మణ్‌రావు


గద్దెకు తాళాలు వేసేందుకు ప్రయత్నిస్తున్న పూజారి కుటుంబ సభ్యులు

ఎస్ఎస్ తాడ్వాయి: సమ్మక్క పూజారి వాటా పంచాయితీ ఈఓ రాజేంద్రం వద్దకు చేరింది. తాను చేయాల్సిన డ్యూటీ చేల వంశానికి చెందిన వారు చేస్తూ తనను గద్దె పైకి రానివ్వడం లేదని సమ్మక్క పూజారి లక్ష్మణ్‌రావు మంగళవారం ఈఓ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై ఈఓ గద్దెలపై డ్యూటీ చేస్తున్న చేల రామారావును పిలిపించి మాట్లాడగా తమ వంశీయులు కూడా వాటా హక్కుదారులని, దానికి సంబంధించి కోర్టు ఉత్తర్వులు కూడా ఉన్నాయని తెలిపారు. గత జాతరకు సంబంధించి తమకు రావాల్సిన వాటా మొత్తం ఇంకా చెల్లించకపోవడంతో ఆయనకు బదులుగా తాము పూజలు నిర్వహిస్తున్నామని ఈఓకు వివరించారు. దీంతో వాటాల విషయాన్ని ఇరువర్గాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఈఓ సూచించారు. ఈ క్రమంలో సమ్మక్క పూజారి లక్ష్మణ్‌రావు చేల వంశీయులను తన డ్యూటీలోకి రాకుండా చర్య తీసుకోవాలని ఈఓకు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న చేల వంశీయులను పూజారి లక్ష్మణ్‌రావు పూజా కార్యక్రమాలు విరమించుకోవాలని కోరాడు. వారు విరమించుకోవడంతో సమ్మక్క గద్దెకు తాళాలు వేశాడు. వెంటనే ఈఓ స్పందించి సిబ్బందితో తాళాలు తీయించారు. వాటా విషయం ఉంటే పరిష్కరించుకోవాలనే గాని.. గద్దెలకు తాళాలు వేయవద్దని ఈఓ సూచించారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు


గాయపడిన అభినవ్


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

- ఎగిరి మరో కారుపై పడిన వైనం
- రాఘవాపూర్‌లో ఘటన
- నలుగురికి గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్: నల్గొండ నుంచి కాజీపేటకు వస్తున్న కారు ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టి గాలిలో ఎగిరి వరంగల్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న మరో కారుపై పడింది. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం రాఘవాపూర్‌లో జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. వరంగల్ మట్టెవాడకు చెందిన ఏవీవీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పత్రి లక్ష్మీనర్సింహప్రసాద్, ఆయన భార్య పత్రి నాగలక్ష్మీ, ఆమె కుమారుడు ప్రణీత్, డ్రైవర్ సొల్లేటి అజయ్‌కుమార్ మంగళవారం ఉదయం వరంగల్ నుంచి కారులో సికింద్రాబాద్‌కు బయలుదేరారు. అలాగే, నల్గొండకు చెందిన పురుషోత్తమ్‌రావు కొన్నేళ్లుగా కాజీపేట ఫాతిమాలో నివాసం ఉంటున్నారు. సంక్రాంతి పండుగకు స్వగ్రామమైన నల్గొండకు వెళ్లి కారులో కాజీపేటకు భార్య అమలాద్భవి రాణి, కుమారుడు వేదస్ అభినవ్‌తో కలిసి వస్తున్నారు. రాఘవాపూర్‌కు రాగానే పురుషోత్తమ్‌రావు కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఎగిరి లక్ష్మీనర్సింహప్రసాద్ కారుపై పడింది. ఈ ప్రమాదంలో రెండు కార్లలో ఉన్న పత్రి నాగలక్ష్మీ, బాలుడు వేదస్ అభినయ్‌కు తీవ్రగాయాలు కాగా, రాణి అజయ్‌కుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు.


అంతర్రాష్ట్ర వంతెనపై సిమెంట్ తేలి బయటపడిన రాడ్లు


వంతెనపై ఏర్పడిన గుంతలు

‘మహా’ డేంజర్!

- వంతెనపై సిమెంట్ తేలి రాడ్లు బయటకు..
- పట్టించుకోని జాతీయ రహదారుల ఇంజనీరింగ్ అధికారులు

కాళేశ్వరం: జాతీయ రహదారే కదా అని ఆదమరిచి డ్రైవింగ్ చేస్తే అంతే. తెలంగాణ – మహారాష్ట్రలను కలుపుతూ నిర్మించి అంతర్రాష్ట్ర వంతెనపై అక్కడక్కడా సిమెంట్ తేలిపోయి ఇనుప రాడ్లు బయటపడ్డాయి. దీంతో రాడ్లు తేలిన గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాలు చెడిపోతున్నాయి. ఒకవేళ అతి వేగంతో వచ్చి గుంతలో పడితే ఏకంగా వంతెన మీద నుంచి గోదావరిలో పడే అవకాశం లేకపోలేదు. ఇక కనీసం విద్యుత్ వెలుగులు కూడా లేని వంతెనపై రాత్రివేళలో ప్రయాణమంటే ‘మహా’ డేంజర్ అంటూ జనం జంకుతున్నారు. గుంతల వద్ద ఎర్ర బట్టలు, బండరాళ్లు పెట్టారు. వాటితో కూడా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. భారీ ప్రమాదాలు జరగక ముందే ఇరు రాష్ట్రాల ఎన్‌హెచ్ అధికారులు చర్యలు తీసుకొని మరమ్మతులు చేయాలని తెలంగాణ – మహారాష్ట్ర ప్రజలు కోరుతున్నారు.

స్వాములపై దొంగతనం ఆరోపణ

- పోలీస్‌స్టేషన్‌కు తరలింపు
- తులిస్యా తండాలో ప్రచారం సందర్భంగా ఘటన
- పుస్తెలతాడు దొరకడంతో కథ సుఖాంతం


దొంగతనం ఆరోపణలు ఎదుర్కొన్న స్వాములు

కురవి: మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన తుల్జా భవాని, సేవాలాల్ మహారాజ్ స్వాములు దైవ ప్రచారం కోసం మంగళవారం మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రం శివారు తులిస్యాతండా జీపీకి వెళ్లారు. తండాలో ప్రచారం చేస్తుండగా బానోత్ రెడ్యానాయక్ భార్య తన కుమార్తె జాతకం చెప్పాలని వారిని కోరింది. దీంతో స్వాములు ఆమెతో మాట్లాడి పుస్తెలతాడు బయటకు తీయమని చెప్పారు. ఆ సమయంలో పుస్తెలతాడు మెడలో లేకపోవడంతో ఆమె లబోదిబోమంది. రెడ్యానాయక్ భార్య అరుపులు విన్న చుట్టుపక్కల జనం వచ్చి స్వాములపై దొంగతనం మోపి కురవి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై పోలీసులు స్వాములను విచారించారు. అదే సమయంలో రెడ్యానాయక్ ఇంట్లోనే పుస్తెలతాడు ఉందని పోలీసులకు సమాచారం అందడంతో స్వాములు ఊపిరి పీల్చుకున్నారు. దొంగతనం ఆరోపణ మోపడంతో ఇబ్బంది పడ్డామని స్వాములు రాంరావు, అంకుస్, శివాజీ, సకరాలు ఆవేదనతో తెలిపారు.